సాక్షి
నిర్మల్
ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



హ్యాట్రిక్ ఎమ్మెల్యేలు 10లో▸

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు హ్యాట్రిక్ సొంతం చేసుకున్నారు. మంచిర్యాల, సిర్పూర్, ఖానాపూర్, బోథ్ నియోజకవర్గాల్లో ఒక్కరికీ హ్యాట్రిక్ దక్కలేదు.



నేటి నుంచి శారదీయ నవరాత్రులు

బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో ఆదివారం నుంచి శారదీయ నవరాత్రి ఉత్సవాలు ఆరంభం కానున్నాయి. ఈనెల 23 వరకు తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు కొనసాగుతాయి. 10లో▸

గరిష్టం/కనిష్టం
34.8 /23.3

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. వేడి, ఉక్కపోత కొనసాగుతుంది. సాయంత్రం చినుకులు పడే అవకాశం ఉంది.

టికెట్ టెన్షన్!

- 'అభ్యర్థిత్వం' కోసం కాంగ్రెస్, బీజేపీ నేతల నిరీక్షణ
- మంచి రోజులు రావడంతో లిస్ట్ రెడీ చేస్తున్న పార్టీలు
- నేడు కాంగ్రెస్ ఫస్ట్ లిస్ట్ ప్రకటన
- ఒకటి రెండు రోజులు బీజేపీ జాబితా కూడా..



నిర్మల్: ఎన్నికల షెడ్యూల్ వచ్చినా ఇంకా తమ అభ్యర్థి ఎవరోనన్న డైలామాలో కార్యకర్తల్లో ఉండగా, తమలో ఎవరిని టికెట్ దక్కుతుందోనన్న టెన్షన్ ఆశావహుల్లో కనిపిస్తోంది. వారం పదిరోజులుగా ఏది అడిగినా.. ఏం మాట్లాడినా టికెట్ ఫైనల్ కానీ చూద్దాం అంటున్నారు. ఇక పితృపక్షాలు పూర్తికావడం, శరన్నవరాత్రులూ రావడంతో రెండు మూడు రోజుల్లో అభ్యర్థుల జాబితా ప్రకటించేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. ఆశ వహులు, ఆయా పార్టీల శ్రేణులు కూడా ఆశగా ఎదురు చూస్తున్నారు.

ముథోల్‌లో ముగ్గురు..

జిల్లాలోని మూడు నియోజకవర్గాలతో పోలిస్తే ముథోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ టికెట్ల కోసం ముగ్గురు చొప్పున పోటీ పడుతున్నారు. బీజేపీలో దాదాపు ఏడాదికాలంగా జిల్లా అధ్యక్షురాలు రమాదేవితోపాటు డీసీసీ అధ్యక్ష స్థాయిలో పార్టీలో చేరిన రామారావుపటేల్, సీనియర్ నేత మోహన్‌రావు పటేల్ టికెట్ ఆశిస్తున్నారు. వీరిలో ఎవరికి ఇస్తారనే విషయం ఇప్పటికీ తేలడం లేదు. మరోవైపు ముగ్గురూ సమానంగా ప్రచారంలో పాల్గొంటుండటం, కార్యక్రమాలను చేపట్టడంతో కార్యకర్తల్లోనే డైలామా నెలకొంది. ఇక ఇక్కడ కాంగ్రెస్ పరిస్థితి మరింత విచిత్రంగా ఉంది. ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న ముథోల్ ఇప్పుడు సరైన అభ్యర్థిని ఎంపిక చేసుకోలేని దుస్థితి నెలకొంది. సీనియర్ నేతలు ఆనంద్‌రావు పటేల్, విజయ్‌కుమార్‌రెడ్డికి దీటుగా కొత్తగా పార్టీలో చేరిన డాక్టర్ కిరణ్‌కుమార్ ప్రచారం చేసుకుంటున్నారు. ఈ ముగ్గురూ ఎవరికి వారు తమకే టికెట్ వస్తుందన్న ధీమాలో ఉన్నారు.

నిర్మల్.. ఫైనల్..

నిర్మల్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులెవరనేది దాదాపు ఖాయమైనట్లేనంటున్నారు. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఒక్కరే బరిలో ఉన్నారు. గతంలో టికెట్ ఆశించిన డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి ప్రస్తుతం స్తబ్దుగా ఉన్నారు. దీంతో ఇక్కడ మహేశ్వర్‌రెడ్డికే టికెట్ ఖాయం కానుండటంతో ఆయన జోరుగా ప్రచారం చేసుకుంటున్నారు. కాంగ్రెస్‌లోనూ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పేరు ఖాయమైనట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఈమేరకు ఆయన కూడా ప్రచార స్పీడ్ పెంచారు. చేరికలనూ ప్రోత్సహిస్తున్నారు. ఇదే పార్టీకి చెందిన సారంగపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి తదితరులు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నా.. శ్రీహరిరావువైపే అధిష్టానం మొగ్గుచూపుతోందని హస్తం శ్రేణులు చెబుతున్నాయి.

ఖానాపూర్‌లో ఎవరికో..

ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానం అయిన ఖానాపూర్‌లోనూ బీజేపీ, కాంగ్రెస్ పంచాయతీ తేలడం లేదు. ఇక్కడి నుంచి ముగ్గురు నలుగురు బీజేపీ టికెట్ ఆశిస్తున్నారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, పెంబి జెడ్పీటీసీ జానకీబాయి మధ్య పోటీ ఉండగా, అజ్మీరా హరినాయక్ తానూ ఆశిస్తున్నట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ టికెట్‌కూ పోటీ తీవ్రంగా ఉన్నా.. ఇక్కడ ఆదివాసీ నేత, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మబొజ్జు పటేల్‌కు దక్కవచ్చన్న ప్రచారం సాగుతోంది. మరోవైపు ఎస్టీ సెల్ నేత భరత్‌చౌహాన్, ఏఐసీసీ నేత వినోద్‌నాయక్ కూడా టికెట్ రేసులో ఉన్నామంటున్నారు.

నేడే కాంగ్రెస్ ఫస్ట్ లిస్ట్ రిలీజ్..

బీఆర్ఎస్ తమ అభ్యర్థులను ముందుగానే ప్రకటించి ప్రచారంలోనూ దూసుకుపోతోంది. నిర్మల్ నుంచి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్ నుంచి విఠల్‌రెడ్డి యథావిధిగా ఉండగా, ఖానాపూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్‌కు ఇవ్వకుండా కొత్తగా వచ్చిన జాన్సన్‌నాయక్‌కు అభ్యర్థిత్వం ప్రకటించారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తమ అభ్యర్థుల జాబితా ఎప్పుడొస్తుందా.. అని ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ఫస్ట్ లిస్టను ఆదివారం ప్రకటించాలని పార్టీ ఎన్నికల కమిటీ నిర్ణయించింది. తొలి జాబితాలోనే జిల్లాలోని మూడు నియోజవర్గాల అభ్యర్థులు ఖరారావుతారని తెలుస్తోంది. ఇక బీజేపీ కూడా రెండు మూడు రోజుల్లో తొలి జాబితా ప్రకటించేందుకు కసరత్తు చేస్తోంది.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి

- నియమావళిపై అవగాహన ఉండాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల అధికారులు తమకు కేటాయించిన విధులు సక్రమంగా, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర ఆశిష్ సంగ్వాన్ సూచించారు. నోడల్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి రోజువారీ నివేదికలు సకాలంలో పంపాలని ఆదేశించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల విధులు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కమిటీల వారీగా ఎన్ని కల నిర్వహణకు మ్యాన్‌పవర్, శిక్షణ మెటీరియల్ , ట్రాన్స్ పోర్ట్ మేనేజ్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, ఐటీ సిస్టం, స్వీప్ యాక్టివిటీస్, ఓటరు అవగాహన, నమోదు, లాఅండ్ఆర్డర్, ఈవీఎం సెక్యూరిటీ ప్లాన్, ఈవీఎం మేనేజ్‌మెంట్, ఎన్నికల నియమావళి, ఎక్స్‌పెండేచర్ కమిటీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్ట ర్ మాట్లాడుతూ అధికారులు హెడ్ క్వార్టర్ మెయింటేన్ చేయాలని సూచించా రు. ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని, పెండింగ్ పనులు వారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో నిత్యం సిబ్బంది అందుబాటులో ఉంటారని, ఎన్నికలకు సంబంధించి సమస్య ఉంటే సంప్రదించాలని తెలిపారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బాధ్యతలు చేపట్టిన కలెక్టర్



బాధ్యతలు చేపట్టిన కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కలెక్టర్‌గా ఆశిష్‌సాంగ్వాన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి కలెక్టర్‌కు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో ఎస్పీ ప్రవీణ్‌కుమార్, అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించారు.

శనిదేవుని ఆలయంలో భక్తుల పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భైంసాటౌన్: శనివారం అమావాస్య సందర్భంగా పట్టణంలోని శనీశ్వరాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. నవగ్రహాలకు తైలాభిషేకం, పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సేవాభారతి, సత్యసాయి సేవాసమితి, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. స్థానిక వినాయక ఆలయంలోనూ పూజలు చేశారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



పీజీ. రెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపకులు

నిర్మల్ ఖిల్లా: నిర్మల్ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న పీజీ.రెడ్డికి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ప్రకటించింది. పట్టణానికి చెందిన పీజీ.రెడ్డి చరిత్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జి.అంజయ్య ఆధ్వర్యంలో 'మధ్యయుగ ఆంధ్రదేశంలో సాంఘిక, సాంస్కృతిక, చారిత్రక, ఆర్థిక పరిస్థితులు' అనే అంశంపై పరిశోధక గ్రంథాన్ని సమర్పించారు. ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు వీరి పరిశోధనకుగాను పీహెచ్డీ ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు పీజీ.రెడ్డికి సమాచారం అందించారు. ప్రిన్సిపల్ భీమారావు, అధ్యాపకులు అభినందించారు.

డిపోను సందర్శించిన డిప్యూటీ రీజినల్ మేనేజర్



స్వాగతం పలుకుతున్న ప్రతిమారెడ్డి

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ డిపోను నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ రీజినల్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం డిపోకు సంబంధించిన పలు రికార్డులు, బస్సుల మరమ్మతు వివరాలు పరిశీలించారు. ఆయన వెంట అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, కంట్రోలర్లు పోశెట్టి, కేఎం.రెడ్డి, డి.గంగన్న ఉన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు..

నిర్మల్‌టౌన్: ఈనెల 21 నుంచి 23, 28, 29, 30 తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి నగదు బహుమతి ఇవ్వనున్నట్లు నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రీజియన్‌లలో కలిపి 110 మందికి రూ.11 లక్షల నగదు బహుమతులు ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఒక్కో రీజియన్‌లో ఐదుగురు మహిళలు , పురుషులను ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.9,900 అందజేయనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు టికెట్ వెనకాల సెల్ నంబర్, చిరునామా రాసి బస్టాండ్‌లోని మహిళల డ్రాబాక్స్‌లో మహిళలు, పురుషుల డ్రాబాక్స్‌లో పురుషులు వేయాలని సూచించారు.

పండుగకు ప్రత్యేక బస్సులు

దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్‌లోని మియాపూర్, నిజాంపేట్, బాచుపల్లి, కూకట్‌పల్లి నుంచి నిర్మల్‌కు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. 30 మంది ప్రయాణికులు ఉంటే సాధారణ చార్జీలకే ఇంటి వద్దకే బస్సు పంపుతామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాచారం కోసం 99592 26003, 94927 67879 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

వరుస వాయిదాలతో నైరాశ్యం



జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు

- దిక్కుతోచని స్థితిలో నిరుద్యోగులు
- ప్రభుత్వం తీరుపై నిరసన

నిర్మల్ ఖిల్లా: తెలంగాణ ప్రభుత్వం చాలా ఏళ్ల తర్వాత వరుసగా నోటిఫికేషన్లు ప్రకటించి నియామక పరీక్షల కోసం తేదీలను కూడా ఖరారు చేసింది. దీంతో నిరుద్యోగులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలో వివిధ కారణాలతో ఒక్కొక్క పరీక్ష వాయిదా పడుతూ వస్తోంది. దీంతో జిల్లాలోని నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. తాజాగా డీఎస్సీ(టీఆర్టీ) పరీక్షలను సైతం వాయిదా వేయడంతో మరింత నైరాశ్యం అలుముకుంది. ఇప్పటికే గ్రూప్–1 పరీక్షను రెండుసార్లు నిర్వహించగా దానిని కూడా హైకోర్టు మళ్లీ నిర్వహించాలని స్పష్టం చేసింది. దానిపై నీలి నీడలు కమ్ముకున్నాయి. గ్రూప్–2 పరీక్షను కూడా వాయిదా వేశారు. టీఎస్‌పీఎస్సీ నిర్వహించే మిగతా పరీక్షలైన గ్రూప్–3 తేదీలు ఇంకా ఖరారు చేయలేదు. గ్రూప్–4 పరీక్షల నిర్వహణ పూర్తవగా దానికి సంబంధించిన ఫలితాలు వెల్లడించాల్సి ఉంది. ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష ఫలితాలు విడుదల చేశారు. ఇదిలాఉండగా కానిస్టేబుల్ పరీక్ష ఫలితాలపై కొంతమంది హైకోర్టు తలుపుతట్టగా కొన్ని ప్రశ్నలకు మార్కులను కలుపుతూ పరీక్ష ఫలితాలను పునఃప్రకటించాలని తీర్పు ఇచ్చింది. దీంతో ఆ పరీక్ష ఫలితాలపై కూడా ఉత్కంఠ కొనసాగుతోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలోనే ఇప్పటికే గ్రూప్ 2 పరీక్షలు వాయిదా పడ్డాయి.

ఎన్నికల కారణంగా..

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పరీక్షల నిర్వహణకు సిబ్బంది కొరత ఏర్పడుతుందని భావించి టీఎస్‌పీఎస్సీ అధికారులు వాయిదా వేశారు. వాస్తవానికి నవంబర్ 2, 3 తేదీల్లో గ్రూప్ 2 పరీక్షలు జరగాల్సిఉంది. ఈ పరీక్షలను జనవరి 6, 7 తేదీల్లో నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించింది. ఎన్నికల కారణంగానే రెండు రోజుల క్రితం డీఎస్సీ (టీఆర్టీ)పరీక్షలను కూడా వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో నిరుద్యోగులు అయోమయానికి గురవుతున్నారు. ఈ పరీక్షలను నవంబర్ 20 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు తేదీలు ఖరారు చేశారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో పోలింగ్ తేదీ నవంబర్ 30న ఉండడంతో టీఆర్టీ వా యిదా వేశారు. తిరిగి ఎప్పుడు నిర్వహిస్తారో తెలు పలేదు. దీంతో ఇన్నిరోజులు గ్రంథాలయాల్లో, కోచింగ్ సెంటర్లలో, ఇరుకుగదుల్లో పుస్తకాలతో కుస్తీపడుతున్న నిరుద్యోగులు తమ సహనాన్ని పరీక్షిస్తున్నారంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వేలు ఖర్చుపెట్టి కోచింగ్..

గత ఆరు నెలలకుపైగా కుటుంబ సభ్యులకు, ఇంటికి దూరంగా ఉంటూ వేలాది రూపాయల ఖర్చుతో కోచింగ్ సెంటర్లలో రోజుల తరబడి పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న తరుణంలోనే వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడంతో జిల్లాకు చెందిన అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. టెట్ పరీక్ష కూడా పూర్తి చేసుకుని టీఆర్టీకి దరఖాస్తులు చేసుకుంటున్న సమయంలోనే పరీక్షను వాయిదా వేయడంపై అభ్యర్థులు భగ్గుమంటున్నారు. రెండు రోజుల క్రితం జిల్లా గ్రంథాలయం ఆవరణలో నిరుద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ నిర్వహించే పరీక్షలన్నీ వాయిదాల పర్వంతో సాగుతున్నాయంటూ అభ్యర్థులంతా కలిసి ఫ్లెక్సీ బ్యానర్ ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. స్పష్టమైన జాబ్ క్యాలెండర్ లేకుండా నిరుద్యోగుల సమయం, డబ్బులు వృథా చేస్తున్నారని మండిపడుతున్నారు.

పరీక్షలు ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి..



రెండేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందన్న ఆశతో ప్రిపేర్ అవుతున్న. ఎట్టకేలకు అరకొర పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. దరఖాస్తుల ప్రక్రియ కూడా ప్రారంభం కావడంతో ప్రిపరేషన్ తీవ్రతరం చేశాను. ఈ క్రమంలోనే పరీక్షను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తిరిగి ఎప్పుడు నిర్వహిస్తారన్నది కూడా స్పష్టం చేయలేదు. గ్రూప్–1, 2 పరీక్షలు కూడా ఇదేవిధంగా వాయిదా పడుతూ వస్తున్నాయి. జాబ్ క్యాలెండర్ ప్రకటించి ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి.

– షేక్ ఎజాస్, టీఆర్టీ అభ్యర్థి, నిర్మల్

వ్యయప్రయాసలకోర్చి ప్రిపేరవుతున్నా...



నోటిఫికేషన్ వెలువడేకంటే ముందునుండే అనేక వ్యయప్రయాసలకోర్చి ప్రిపరేషన్ కొనసాగిస్తున్నాను. మధ్యతరగతి వారికి ప్రభుత్వ ఉద్యోగం అనేది ఒక కల. ఆ కలను నెరవేర్చుకోవడం కోసం సీరియస్‌గా ప్రిపేర్ అవుతున్నాను. ఈ తరుణంలో పోటీ పరీక్షల తేదీలను వాయిదా వేస్తూ తీసుకున్న నిర్ణయం నాలాంటి వారందరికీ ఆవేదన కలిగిస్తోంది. ప్రభుత్వ ప్రణాళికా లోపంతోనే ఇలాంటి పరిస్థితి వస్తోంది. ఇప్పటికైనా పక్కాగా నిర్వహించాలి.

– దేవోళ్ల రాజేశ్వర్, అభ్యర్థి, నిర్మల్

బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



ప్రచారం నిర్వహిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీకి ఓటేస్తే.. బీఆర్ఎస్‌కు వేసినట్టేనని, రెండు పార్టీలు ఒక్కటేనని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. నిర్మల్‌లోని మయూరి హోటల్, పాత బస్టాండ్, గంగ కాంప్లెక్స్, నారాయణరెడ్డి కాంప్లెక్స్ డాక్టర్స్ లైన్స్‌లోని వాణిజ్య సముదాయాల్లో కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియాగాంధీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ హామీలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.2 లక్షల పంట రుణాలు మాఫీ చేస్తామని తెలిపారు. ఎకరానికి 15 వేల పెట్టుబడి అందిస్తామన్నారు. అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడంలో కేసీఆర్‌ని మించిన నాయకుడు లేరని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఎన్నో పోరాటాలు చేశానని, సీఎం కేసీఆర్ నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. కబ్జాల మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, సండే ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి అవకాశం ఇచ్చారని, వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు.

'గృహలక్ష్మి'లో అవకతవకలపై ఆందోళన



సర్పంచ్ భర్తను నిలదీస్తున్న గ్రామస్తులు

ఖానాపూర్: గృహలక్ష్మి పథకం అమలులో అవకతవకలను నిరసిస్తూ మండలంలోని దిలావర్‌పూర్ గ్రామస్తులు శనివారం ఆందోళనకు దిగారు. స్థానిక గ్రామపంచాయతీలో సర్పంచ్ భర్త ప్రతాప్‌రావును నిలదీశారు. ఉపసర్పంచ్ పంబాల రాజన్నతోపాటు వార్డు సభ్యుడు నబీ, వీడీసీ సభ్యుడు చెక్కిల్ల భూమాగౌడ్, రాసమల్ల పెద్దనర్సయ్య, కామోజీ శ్రీనివాస్, రాసమల్ల అశోక్, చింతల మల్లేశ్ మాట్లాడారు. ఎలాంటి తీర్మానం లేకుండా ఏకపక్షంగా లబ్ధిదారుల ఎంపిక చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహలక్ష్మి పథకం కోసం ఇళ్లు లేని 80 పేద కుటుంబాలు దరఖాస్తు చేసుకుంటే వాటిలో నుంచి కేవలం 25 మంది పేర్లను మాత్రమే ఉన్నతాధికారులకు ఏ విధంగా నివేదించారని నిలదీశారు. నివేదించిన వాటిలో నుంచి సైతం 14 మందికి మాత్రమే ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామసభ ఏర్పాటు చేయకుండా సర్పంచ్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం ఎదుట టెంట్ వేసుకుని అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. నిరసనలో నబీఖాన్, మైస శ్రీనివాస్, పీటర్, నాగరాజు, దేవరాజం, లచ్చన్న, రాజేశ్వర్, శ్రీనివాస్, సురేశ్, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర చెక్ పోస్టు తనిఖీ



చెక్‌పోస్టు వద్ద ఆర్టీవో విజయ్ కుమార్

కుంటాల: మండలంలోని దౌనెల్లి తండా వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్టును నిర్మల్ ఆర్డీవో విజయ్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది దత్తాద్రియాదవ్ ఉన్నారు.

'వ్యూహం' ఫలించేనా?

- కాంగ్రెస్ పార్టీ తొలి జాబితాకు ముహూర్తం ఖరారు
- 'పీఎస్సార్'పైనే అనుయాయుల ఆశలు
- గట్టి పోటీ ఇస్తున్న మరోవర్గం ఆశావహులు
- అభ్యర్థులను ప్రకటిస్తే అసంతృప్తిపై ముందే అంచనా

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థుల జాబితా వెలువడనున్న నేపథ్యంలో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. రేపో మాపో కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ తొలి జాబితా ప్రకటించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది స్థానాల్లో ఆశావహుల్లో ఎవరికి టికెట్ దక్కుతుందనే చర్చ సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో కీలకంగా ఉన్న పీసీసీ వ్యూహ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు అనుయాయులకు, పోటీ వర్గంగా ఉన్న నాయకుల్లో ఎవరికి టికెట్లు దక్కుతాయోనని పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ రేపుతోంది. ఉమ్మడి జిల్లాలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అనుచర వర్గాలుగా కొనసాగుతున్నాయి. పోటాపోటీగా ఉన్న ఆశావహుల్లో ఎవరికి 'చేయి' అందిస్తారనేది ఆసక్తిగా మారింది.



వడపోతలు, సమీకరణలు

ఆశావహుల బలాలు, బలహీనతలు, సామాజిక కోణాలు, సర్వేలో ఫలితాలు తదితరవన్నీ లెక్కలు వేశాకే టికెట్ల పంపకం ఓ కొలిక్కి వచ్చింది. రాష్ట్రం యూనిట్‌గా ఉమ్మడి జిల్లాలో జనరల్‌లో ఓసీ, బీసీలు, ఎస్సీల్లో మాల, మాదిగ, నేతకాని, ఎస్టీలో లంబాడా, ఆదివాసీ తదితర సామాజిక వర్గాల లెక్కలు తీసుకున్నారు. ఎవరికి వారు తమ వర్గాలను ప్రోత్సహిస్తూ ఉండడంతో ఢిల్లీ స్థాయిలో జరిగిన అభ్యర్థుల ఎంపికలో ఎవరి పేర్లు ఉండబోతాయనేది సస్పెన్స్‌గా మారింది. మంచిర్యాలలో మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, నిర్మల్‌లో కూచాడి శ్రీహరిరావు, బెల్లంపల్లిలో వినోద్, చెన్నూరుకు నల్లాల ఓదెలు పేర్లు వినిపిస్తున్నా.. ఇంకా అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది.

ఎవరికి వారే ధీమా..

ఆదిలాబాద్‌లో గండ్రత్ సుజాత, బోథ్‌లో వన్నెల అశోక్, ఖానాపూర్‌లో పుర్క బాపురావు, పెందోర్ ప్రభాకర్, చారులత రాథోడ్, ఆసిఫాబాద్‌కు గణేశ్ రాథోడ్, బెల్లంపల్లిలో నాతరి స్వామి, రొడ్డ శారద, చెన్నూరులో నూకల రమేశ్ వంటి నాయకులు పీఎస్సార్‌కు అనుయాయులుగా ఉన్నారు. వీరికి పోటీగా ఆశావహుల్లో ఆదిలాబాద్ సాజిద్‌ఖాన్, బీజేపీ నుంచి చేరిన కంది శ్రీనివాస్‌రెడ్డి, బోథ్‌లో ఆడె గజేందర్, ఆసిఫాబాద్‌లో మర్సుకోల సరస్వతి, శ్యామ్‌నాయక్, చెన్నూరులో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో మాజీ మంత్రి బోడ జనార్దన్, గోమాసే శ్రీనివాస్, రాజా రమేశ్, డాక్టర్ శ్రీనివాస్, రాధిక, దుర్గం భాస్కర్, అశోక్, నరేశ్, మంచిర్యాలలో కేవీ ప్రతాప్ తదితరులు ఉన్నారు. ఇక ముథోల్‌లో డాక్టర్ కిరణ్, ఎన్ఆర్‌ఐ విజయ్‌కుమార్‌రెడ్డి, షిండే ఆనంద్‌రావు పటేల్, నిర్మల్‌లో కూచాడి శ్రీహరిరావు, సిర్పూర్‌లో రావి శ్రీనివాస్ ఉన్నారు. పోటాపోటీగా జిల్లా నుంచి మొదలు గాంధీ భవన్, ఢిల్లీ స్థాయిల్లో పైరవీలు చేసుకున్నారు. చివరకు ఎవరిని టికెట్ వరిస్తుందో వేచి చూడాలి.

బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలకే..?

బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, రేఖానాయక్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి వస్తే ఇక్కడి ఆశావహులకు ఇబ్బందులు కలుగవచ్చు. ఉమ్మడి జిల్లాలో మూడు ఎస్టీ స్థానాలను ఆదివాసీ, లంబాడాల నాయకులకు పంచాల్సి ఉంది. రాష్ట్రంలో ఎస్టీ స్థానాల్లో ఎంపిక ఇక్కడ ప్రభావం చూపవచ్చు. ఇప్పటివరకు ఆసిఫాబాద్ స్థానం ఆదివాసీకి ఇస్తూ, బోథ్, ఖానాపూర్‌లో లంబాడా, ఆదివాసీలకు మార్చుతున్నారు. ఈసారి ఈ కూర్పులో మార్పులు ఉండే అవకాశం ఉంది. మరోవైపు ఎమ్మెల్యే రేఖానాయక్, భర్త శ్యామ్‌నాయక్ ఇద్దరు టికెట్ ఆశిస్తున్నారు. ఒక కుటుంబంలో ఒకరికే టికెట్ నిబంధన అమలు చేస్తే వీరిలో ఎవరు సీటు త్యాగం చేస్తారనేది వేచిచూడాలి.

లీకేజీలకు మరమ్మతు



మరమ్మతులు చేసిన సిబ్బందితో అధికారులు

కడెం: కడెం ప్రాజెక్ట్ వరద గేట్ల లీకేజీలతో నీరంతా గోదావరి పాలైంది. మెకానికల్ సిబ్బంది చేసిన మరమ్మతులతో శనివారం 8వ, నంబర్ వరద గేటు లీకేజీలు ఆగినట్లు ఈఈ విఠల్ వెల్లడించారు. లీకేజీలతో ప్రాజెక్ట్ నీటిమట్టం ఐదు ఫీట్ల మేర తగ్గింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700(7.603 టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 693.675(6.055టీఎంసీ) అడుగులు ఉంది. గతేడాది అక్టోబర్ 14న ప్రాజెక్ట్ నీటిమట్టం 698.675 అడుగులు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ప్రతిష్టాత్మక ఫెలోషిప్‌లో జిల్లా వాసి ప్రతిభ


రష్మీ కందుకూరి

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ రష్మీ కందుకూరి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఎఫ్ఆర్ సీఆర్ ఫెల్లోషిప్‌లో ఉత్తీర్ణత సాధించారు. లండన్‌లోని ద రాయల్ కాలేజ్ ఆఫ్ రేడియాలజిస్ట్ నిర్వహించిన క్లినికల్ రేడియాలజీ పరీక్షల్లో పార్ట్ ఏ, పార్ట్ బీ పరీక్షలకు ప్రపంచ వ్యాప్తంగా 134 మంది హాజరు కాగా 65మంది ఉత్తీర్ణత సాధించారు. రిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ అశోక్–రమ దంపతుల కుమార్తె రష్మీ కందుకూరి చోటు సంపాదించారు. ఆమె ఇప్పటికే బ్రెస్ట్ ఇమేజింగ్లో ఫెలోషిప్ పూర్తి చేయగా ప్రస్తుతం మాంచెస్టర్ యూనివర్సిటీలో మస్క్యులోస్కెలిటల్ ఇమేజింగ్ విభాగంలో ఫెలోషిప్ చేస్తుండడం విశేషం. ఈ ఫెల్లోషిప్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి రాయల్ కాలేజ్ ఆఫ్ రేడియాలజీ ఆధ్వర్యంలో డిగ్రీ ప్రదానం చేయనున్నారు.

ఆరోగ్యానికి రక్ష..మడ్ బాత్


ప్రదర్శనలో యోగా సాధకులు

కుంటాల: ఆరోగ్యానికి రక్ష మడ్‌బాత్ (మట్టి స్నానం) అని యోగారత్న ఎక్కొండ ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని కల్లూరు శ్రీసాయి మోడల్ పాఠశాల ఆవరణలో సామూహిక మడ్ బాత్ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గోమూత్రం, పాలు, నెయ్యి, నిమ్మ, పసుపు, తులసి పొడి, వేప వట్టివేర్లు వంటి వనమూలికలతో స్నానమాచరిస్తే కీళ్ల నొప్పులు, అధిక బరువు, డయాబెటిస్, జీర్ణ సంబంధిత వ్యాధులు, రక్తప్రసరణ మెరుగై చర్మవ్యాధులు రావని పేర్కొన్నారు. ఇందులో 40మంది యోగా సాధకులు సామూహిక స్నానమాచరించారు. అనంతరం మూలికలతో యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు గజానన్, అంజనేయులు, రంజిత్, ఆరోగ్య భారతి రాష్ట్ర సభ్యులు ముష్కం రామకృష్ణ గౌడ్, యజ్ఞ ఉపాసకులు లక్ష్మినర్సయ్య, ప్రిన్సిపాల్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు


ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని సీసీఎస్ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. శనివారం పోలీసులకు సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టారు. ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడకు చెందిన సాయికుమార్ అనే వ్యక్తి ప్యాకెట్లలో ఎండు గంజాయిని నింపి విక్రయిస్తున్నాడు. మహారాష్ట్ర నుంచి తీసుకొచ్చి ఇక్కడ అమ్ముతున్నట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సాయినాథ్ తెలిపారు. 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నాడు.

హ్యాట్రిక్ ఎమ్మెల్యేలు

- ఉమ్మడి జిల్లాలో 8 మంది
- ప్రజల మద్దతుతో వరుసగా మూడుసార్లు గెలుపు
- నాలుగు నియోజకవర్గాల్లో ఎవరికీ దక్కని చాన్స్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1952 నుంచి ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేలు అత్యధిక మెజార్టీ సాధించి హ్యాట్రిక్ సొంతం చేసుకున్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు నుంచి ముగ్గురు, ఆసిఫాబాద్ నుంచి ఒక్కరు, నిర్మల్ నుంచి ఇద్దరు, ముథోల్ నుంచి ఒక్కరు, ఆదిలాబాద్ నుంచి ఒక్కరు మొత్తంగా 8 మంది ఎమ్మెల్యేలు వారికి ఉన్న ప్రజాబలంతో హ్యాట్రిక్ సాధించారు. మిగతా వారు కొద్దిలో హ్యాట్రిక్ మిస్ చేసుకున్నా ప్రస్తుతం జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది హ్యాట్రిక్ సాధించేందుకు వేచిచూస్తున్న వారూ ఉన్నారు. హ్యాట్రిక్ విజయాలు గత ఎన్నికల్లో సాధ్యమైనా ప్రస్తుతం కొన్ని నియోజకవర్గాలకు అందని ద్రాక్షగా మారాయి. మంచిర్యాల, సిర్పూర్, ఖానాపూర్, బోథ్ నియోజకవర్గాల్లో ఒక్కరికి కూడా హ్యాట్రిక్ పొందే అవకాశం రాలేదు. – మంచిర్యాలటౌన్

జంగ్ తెలంగాణ



నిర్మల్ నుంచి 'పొద్దుటూరి, 'సముద్రాల'..


పొద్దుటూరి నర్సారెడ్డి


సముద్రాల వేణుగోపాలాచారి

నిర్మల్ నియోజకవర్గం నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు హ్యాట్రిక్ సాధించారు. 1962, 1967లలో నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన పొద్దుటూరి నర్సారెడ్డి విజయం సాధించారు. మూడోసారి 1972 లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి హ్యాట్రిక్ విజేతగా నిలిచారు. రెవెన్యూశాఖ మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1985, 1989, 1994లో నిర్వహించిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన సముద్రాల వేణుగోపాలాచారి వరుసగా విజయం సాధించారు. 1996, 1998, 1999లో పార్లమెంట్ ఎన్నికల్లోనూ విజయం సాధించి డబుల్ హ్యాట్రిక్ నేతగా పేరుగాంచారు. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రిగా, కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రిగా కూడా పనిచేశారు.

ఆదిలాబాద్‌లో 'జోగు'


జోగు రామన్న

ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యే జోగు రామన్న మాత్రమే హ్యాట్రిక్ సాధించారు. 2009లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన జోగు రామన్న విజయం సాధించారు. ఆ తర్వాత 2011లో జరిగిన ఉప ఎన్నికల్లో, 2014, 2018లో నిర్వహించిన సాధారణ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టడంతో పాటు నాలుగుసార్లు వరుసగా గెలిచిన మొదటి ఎమ్మెల్యేగా రికార్డు సృష్టించారు. రాష్ట్ర అటవీశాఖ, పర్యావరణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. 1978, 1985, 1989, 2004లో నిర్వహించిన ఎన్నికల్లో చిలుకూరి రాంచంద్రారెడ్డి నాలుగుసార్లు గెలిచినా హ్యాట్రిక్ పొందలేక పోయారు.

ముథోల్ నుంచి గడ్డెన్న


జి. గడ్డెన్న

నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గం నుంచి ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా పోటీచేసిన గడ్డెన్న హ్యాట్రిక్ సాధించారు. 1967లో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన గడ్డెన్న ఆ తర్వాత 1972, 1978, 1983లలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి వరుసగా నాలుగుసార్లు విజయం సాధించి హ్యాట్రిక్ సొంతం చేసుకున్నారు. నిత్యం ప్రజాసేవలో ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటున్న గడ్డెన్న 1989, 1999లలో నిర్వహించిన ఎన్నికల్లోసైతం గెలిచి సత్తా చాటారు.

ఆసిఫాబాద్ నుంచి భీమ్‌రావు


కొట్నాక భీమ్‌రావు

1952లో ఆసిఫాబాద్ నియోజకవర్గం ఏర్పడింది. 1962, 1967, 1972లో నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన కొట్నాక భీమ్‌రావు వరుసగా మూడుసార్లు గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో 1978లో తొలిసారి ఈ నియోజకవర్గం ఎస్సీలకు రిజర్వ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన దాసరి నర్సయ్య విజయం సాధించారు. 1983, 1985, 1994లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ నుంచి పోటీ చేసిన గుండా మల్లేశ్ గెలుపొందారు. 1989లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన దాసరి నర్సయ్య రెండోసారి విజయం సాధించారు. కానీ మూడుసార్లు వరుసగా గెలువక పోవడంతో గుండా మల్లేశ్ హ్యాట్రిక్ కోల్పోయారు.

చెన్నూరు నుంచి ముగ్గురు..


కోదాటి రాజమల్లు


బోడ జనార్దన్


నల్లాల ఓదెలు

చెన్నూరు నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో వరుసగా మూడు, నాలుగు సార్లు గెలుపొంది హ్యాట్రిక్ సాధించిన వారు ముగ్గురున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి కోదాటి రాజమల్లు 1962 నుంచి 1978 వరకు మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. 1985లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన బోడ జనార్దన్ ఘన విజయం సాధించారు. వరుసగా నాలుగు సార్లు గెలుపొంది రికార్డు సృష్టించారు. 2009లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన నల్లాల ఓదెలు అత్యధిక మెజార్టీ సాధించి విజయకేతనం ఎగురవేశారు. 2010లో జరిగిన ఉప ఎన్నికతో పాటు, 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ విజయం సాధించారు. ప్రభుత్వ విప్‌గా పనిచేసిన ఆయనకు 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం టీఆర్ఎస్ తరఫున టిక్కెట్ కేటాయించకపోవడంతో నాలుగోసారి పోటీచేసే అవకాశాన్ని చేజార్చుకున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అదే కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న బోడ జనార్దన్ సైతం టికెట్ ఆశించే వారిలో ఉన్నారు.

పోలీసుల తనిఖీల్లో నగదు స్వాధీనం

సోన్: మండలంలోని గంజాల్ టోల్‌ప్లాజా వద్ద శనివారం పోలీసుల తనిఖీల్లో రూ.1,57,250 పట్టుకున్నట్లు సీఐ నవీన్‌కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం... ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారును టోల్‌ప్లాజా వద్ద పోలీసులు తనిఖీ చేశారు. కారులో తరలిస్తున్న డబ్బులకు సంబంధించి సరైన ఆధారాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపాడు. ఇందులో ఎస్సై సంతోషం రవీందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని అర్లి(కె) 61వ జాతీయ రహదారిపైన శనివారం ఎస్సై హన్మాండ్లు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్రకు చెందిన జాదవ్ బాలాజీ కారులో రూ.70వేలా 400, మరో వాహనంలో రూ.91వేలా 650 స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.లక్షా 61వేలా 950 నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై హన్మాండ్లు వెల్లడించాడు. ఏఎస్సై దేవ్‌రావు ఉన్నారు.


టోల్‌ప్లాజా వద్ద పట్టుబడిన నగదుతో సీఐ నవీన్‌కుమార్

మద్యం పట్టివేత

తాంసి: భీంపూర్ మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా విక్రయిస్తున్న దేశీదారుతో పాటు ఇతర మద్యం బాటిళ్లను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు.. భీంపూర్ మండలంలోని అందర్‌బంద్, గోముత్రి గ్రామాల్లో జైనథ్ సీఐ నరేష్ ఆధ్వర్యంలో భీంపూర్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మహారాష్ట్ర నుంచి తీసుకొచ్చిన దేశీదారుతో పాటు ఇతర మద్యంను అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపాడు. మద్యం విలువ రూ.50వేలు ఉంటుందని చెప్పాడు. మండలంలో ఎక్కడైనా మద్యం విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ సూచించారు. వారి వెంట భీంపూర్ ఎస్సై లాల్‌సింగ్ నాయక్, సిబ్బంది గోకుల్, రాజు ఉన్నారు.


పట్టుకున్న మద్యం చూపుతున్న పోలీసులు

మేడిపల్లిలో...

నిర్మల్‌రూరల్: మండలంలోని మేడిపల్లి గ్రామంలో శనివారం రూరల్ పోలీసులు మద్యాన్ని పట్టుకున్నారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో దాడిచేసి గ్రామానికి చెందిన కుంట మహేందర్ ఇంట్లో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.43000 ఉంటుందని, మద్యాన్ని సీజ్ చేసి మహేందర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

చెరువులో దూకి ఒకరి ఆత్మహత్య

భైంసా: బాసర గ్రామంలోని బొర్ర గణేశ్‌గల్లీకి చెందిన ఎం.రాములు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు బాసర ఎస్సై గణేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... రాములు శుక్రవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. శనివారం ఉదయం బాసర గ్రామానికి ఆనుకుని ఉన్న చెరువు రాములు శవమై కనిపించాడు. మద్యానికి బానిసై తరచుగా ఆత్మహత్య చేసుకుంటానని ఇంట్లో బెదిరించేవాడు. వారం రోజుల క్రితం ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు కుటుంబీకులకు తెలిపాడు. రాములుకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పాడు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని హరితవనం పార్కు ఎదుట శనివారం పులి గణేష్(60) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని చించర్‌వాడకు చెంది గణేష్ కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయన జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని ఆత్యహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

తలమడుగు: ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌తో ఇంటికి నిప్పంటుకుని రూ.2లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు మండలంలోని కోసాయి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... కోసాయి గ్రామానికి చెందిన టేకం లక్ష్మీబాయి ఇంట్లో శనివారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పంటుకుంది. ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు మంటలను ఆర్పివేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంటోంది.

నేటి నుంచి శారదీయ నవరాత్రులు


సరస్వతీ అమ్మవారు


విద్యుత్ కాంతుల మధ్య బాసర ఆలయం

- ముస్తాబైన బాసర ఆలయం
- ఆలయం చుట్టూ విద్యుత్ కాంతులు
- ఒక్కోరోజు ఒక్కో రూపంలో దర్శనమివ్వనున్న అమ్మవారు

భైంసా:బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో ఆదివారం నుంచి శారదీయ నవరాత్రి ఉత్సవాలు ఆరంభం కానున్నాయి. ఈనెల 23 వరకు తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు కొనసాగుతాయి. దసరా ఉత్సవాల్లో లక్షలాది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. ఆలయాన్ని, గోపురాలు, ప్రధాన గుడి, అంతరాలయం, మహంకాళి ఆలయం, క్యూలైన్ ప్రాంగణం గార్డెన్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయం కొత్త శోభను సంతరించుకుంది. టీటీడీ సత్రం నుంచి రోడ్డు మార్గంలో ఆలయానికి వెళ్లేలా స్వాగత తోరణాలు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు అమర్చారు. బాసర గోదావరి నది స్నాన ఘట్టాల వద్ద ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నారు. పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రసాదాల కౌంటర్, అక్షరాభ్యాస మండపాల వద్ద రద్దీ దృష్ట్యా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

> **ఏర్పాట్లు పూర్తి..**
> బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఏటా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈసారి ఆదివారం నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దాం. వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.
> – విజయరామారావు, ఆలయ ఈవో

నిత్యాన్నదానం...

బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో ఉచిత అన్నదానం జరుగుతుంది. నాందేడ్‌కు చెందిన బాబాజీ జగదీశ్‌మహారాజ్ గాడిపుర, బాసర ఆలయం ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్నారు.

రోజుకో రూపంలో...

సరస్వతీ అమ్మవారు తొమ్మిది రోజులపాటు రోజుకో రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. మొదటి రోజు శైలపుత్రి అలంకారం, రెండో రోజు బ్రహ్మచారిణి, మూడో రోజు చంద్రఘంట, నాలుగోరోజు కూష్మాండ, ఐదో రోజు స్కంద మాత, ఆరోరోజు కాత్యాయని, ఏడో రోజు కాళరాత్రి, ఎనిమిదో రోజు మహాగౌరి, తొమ్మిదో రోజు సిద్ధిధాత్రి అలంకారంలో దర్శనం ఇస్తారు. అమ్మవారికి ప్రతీరోజు వేర్వేరు నైవేద్యాలు సమర్పిస్తారు. విశేష అర్చనలు, పూజలతో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ ఆధ్వర్యంలో ముథోల్ సీఐ వినోద్‌రెడ్డి, బాసర ఎస్సై గణేశ్ భద్రత చర్యలు తీసుకుంటున్నారు.

దీక్షలకు ఏర్పాట్లు...

నవరాత్రి ఉత్సవాల్లో వందలాది భక్తులు అమ్మవారి దీక్షలు స్వీకరిస్తుంటారు. తెల్లని వస్త్రాలు ధరించి తొమ్మిది రోజులపాటు పాదరక్షలు లేకుండా కఠికనేలపై నిద్రిస్తూ ఉపవాస దీక్షలు చేస్తారు. అమ్మవారికి పూజలు చేసి ఆలయంలోనే సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

బాసరలో టెక్స్‌టైల్స్ కమిషనర్ పూజలు


ఆలయంలో కుటుంబంతో అమ్మవారిని దర్శించుకుంటున్న కమిషనర్ అలుగు వర్షిణి

భైంసా: నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారిని శనివారం తెలంగాణ హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ కమిషనర్ అలుగు వర్షిణి దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా బాసర వచ్చిన కమిషనర్ తన కుమార్తె సరస్వతి, కుమారుడు గుహన్‌అరుణ్‌తో అక్షరాభ్యాస పూజలు చేయించారు. తర్వాత కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం వేదపండితులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.





దాయాదుల పోరు... అభిమానుల హోరు

క్రికెట్ వరల్డ్‌కప్-2023లో భాగంగా చిరకాల ప్రత్యర్థులైన ఇండియా-పాకిస్తాన్ మ్యాచ్ శనివారం జరగగా ప్రేక్షకులు, క్రికెట్ అభిమానులు టీవీలు, ఫోన్లకు అతుక్కుపోయారు. మ్యాచ్ సాగుతున్నంతసేపు ఉత్సాహంగా గడిపారు. దసరా సెలవులు సైతం ప్రారంభం కావడంతో చిన్నారులు ఇండియన్ టీం జెర్సీలు ధరించి జట్టుకు మద్దతుగా నిలుస్తూ మ్యాచ్‌ను ఆస్వాధించారు. ఈ పోరులో భారత్‌జట్టు విజయం సాధించడంతో సంబరాలు చేసుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

24న రాజారావణ్ వర్ధంతి

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని కుమురంభీం కాలనీలో ఈ నెల 24న రాజారావణ్ వర్ధంతి నిర్వహించనున్నట్లు తుడుందెబ్బ జిల్లా కమిటీ అధ్యక్షుడు గోడం గణేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కుట్రలతో బలైన రావణాసుర, నరకాసుర, మహిషాసురులను రాక్షసులుగా చిత్రీకరించి నేటికి దేశవ్యాప్తంగా వారి దహన కార్యక్రమాలు చేపట్టడం హింసను మరింత ప్రేరేపించడమే అవుతుందన్నారు. ఆదివాసీ, దళిత, బహుజన వర్గాల ప్రతినిధి అయిన రాజారావణ్ ధైర్యవంతుడు, విద్యావంతుడు, ప్రచండ మేధావి అని కొనియాడారు. తుడుందెబ్బ అధ్యక్షులు గోడం గణేశ్, కుంద్ర శ్యామ్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్, జిల్లా ప్రచార కార్యదర్శి రేణుక, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఇంద్ర ఉన్నారు.